
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు

సోమవారం 28 జూలై 2025

రూపాయికే అనుమతులు



- మున్సిపాలిటీల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు శుభవార్త
- ఇంటి నిర్మాణానికి తగ్గిన ఆర్థిక భారం
- ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు
- త్వరలో అమలు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి కల. దీన్ని నెరవేర్చుకునేందుకు అష్ట కష్టాలు పడుతుంటారు. పేద, మధ్య తరగతి ప్రజలు సొంతింటి కలను సాకారం చేసేందుకు పడే బాధలు వర్ణనాతీతం. అలాంటి వారికి కూటమి ప్రభుత్వం ఓ శుభవార్త వినిపించనుంది. గతంలో ఇల్లు నిర్మించుకోవాలంటే.. వేలకు వేలు చెల్లిస్తే తప్ప.. అనుమతులు వచ్చేవి కాదు. పైగా అడిగినంత ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. ఈనేపథ్యంలో ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో తాజాగా పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలుస్తూ ఒక్క రూపాయి చెల్లిస్తే.. ఏ మాత్రం ఆలస్యం కాకుండా వెంటనే ఆన్‌లైన్‌లో అనుమతులు పొందొచ్చు. ఈ విధానంతో ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లైంది.

నంద్యాల, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇళ్లను నిర్మించుకునే పేద, మధ్యతరగతి ప్రజలకు కూటమి ప్రభుత్వం అందించింది. 50 చదరపు మీటర్ల వీస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవడానికి ఒక్క రూ పాయి చెల్లిస్తే చాలు.. (అది కూడా ఆన్‌లైన్‌లో) వెంటనే తమ ఇంటి అప్రూవల్ మంజూరు అవుతుంది. సదరు యజమానికి కూడా ఎలాంటి అవస్థలు లేకుండా నిబం ధనల ప్రకారం ఇల్లు నిర్మించుకునేలా ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. ఏది ఏమైనా తాజా నిర్ణయంతో పట్టణాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గి ఇంటి కల నిజమయ్యే అవకాశముంది.

దరఖాస్తు ఇలా..

50 చదరపు మీటర్లు విస్తీర్ణంలో ఇల్లు నిర్మించునే వారు ఎవరైనా జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల పరిధిలో అనుమతి పొందిన ఎల్‌టీపీలను సంప్రదించాలి. ఆ తర్వాత ఖాళీ స్థలం ఫొటో తగిన డాక్యుమెంట్లు, లింక్ డాక్యుమెంట్స్, తదితర వివరాలు.. ఇల్లు నిర్మిం చుకునే ప్లాన్‌తో సహా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆతర్వాత చలానా చెల్లించాల్సి వస్తుంది. వెంటనే ఒక్క రూపాయి ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తే అనుమతులు వచ్చినట్లే. తాజా నిబంధనలతో గతంలో మాదిరిగా ఆయా మున్సిపల్ కార్యాలయాలు, కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో అప్రూవల్ పొందే అవకాశం లభించినట్లైంది.

అనుమతి రాగానే ప్రజలకు..



ఒక్క రూపాయి చెల్లిస్తే ఆలస్యం కాకుండా ఆన్‌లైన్‌లో అనుమతులు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈవిధానం అమల్లోకి రాగానే అధికారుల వద్దకు రావాల్సిన అవసరం లేదు. ఈవిధానం అమలుకు సంబంధించి సమగ్ర వివరాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అనుమతి రాగానే ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తాం. పట్టణ పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ విధానం శుభపరిణామం.

● శేషన్న, కమిషనర్, నంద్యాల

50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో...

గతంలో ఇదే 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించాలంటే.. డెవలప్‌మెంట్, ఇతర చార్జీలతో కలిసి మొత్తంగా ఆ ప్రాంతంలో ఉండే స్థలం విలువలో 20శాతం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఈప్రకారం సుమారు రూ.30నుంచి రూ.40వేల వరకు ఇంటి అప్రూవల్ రూపంలో ప్రతి ఒక్కరు చెల్లించాల్సి వచ్చేది. పైగా కమీషన్లు కూడా ఇవ్వాల్సి ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం రూ.1కే ఇంటి అప్రూవల్ చేసేందుకు శ్రీకారం చుట్టనుంది.



ఆర్థికంగా ఊరట..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో సుమారు 30శాతం వరకు 50 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన వారు ఉన్నట్లు ఆ వర్గాల నుంచి తెలుస్తోంది. ఆయా మున్సిపాలిటీల్లో ఉండే పేద, మధ్య తరగతి వారీగా తెలుస్తోంది. ప్రభుత్వం ఒక్క రూపాయికి ఇంటి అప్రూవల్ సదుపాయం కల్పించడంతో వీరందరికి ఆర్థికంగా ఊరట కల్పించి నట్లైంది. ఇదే క్రమంలో కార్యాలయాలు, అధికారులు చుట్టూ తిరిగి ఆలసిపోకుండా.. వారికి ఇచ్చే కమీషన్ల అదనపు భారంగా లేకుండా సులభతరం కానుంది. చాలా మంది ఈ విధానంతో ముందుకువచ్చి ఇల్లు నిర్మించుకునే అవకాశం లేకపోలేదు.

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు

- నంద్యాల
- ఆత్మకూరు
- ఆళ్లగడ్డ
- డోన్
- బేతంచెర్ల (నగర పంచాయతీ)
- నందికొట్కూరు
- కర్నూలు (కార్పొరేషన్)
- ఆదోని మున్సిపాలిటీ
- ఎమ్మిగనూరు మున్సిపాలిటీ
- గూడూరు నగర పంచాయతీ

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలంలో దర్శనానికి వచ్చిన భక్తులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి):భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దర్శనార్థం భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో రాష్ట్రం నుంచే కాకుండా వివిధప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్య స్నానమాచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు తాగునీరు, అల్పాహారాన్ని అందించారు.

మహానందిలో రద్దీ



మహానందిలో క్యూలో ఉన్న భక్తులు

మహానంది, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రం ఆదివారం వేలాదిమంది భక్తుల రద్దీతో నెలకొంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వివిధ వాహనాల ద్వారా శనివారం రాత్రే చేరుకున్నారు. వేకువజామున్నే రుద్రగుండం కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించడానికి క్యూ కట్టారు. స్వామివారి మహా మంగళహారతులసేవతో పాటు స్పర్శ దర్శనం కోసం బారులు తీరారు. రాత్రి వరకు క్షేత్ర పరిసరాల్లో భక్తులతో రద్దీ వాతావరణం నెలకొంది.

మహానందిలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి జస్టిస్ గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులకు ప్రసాదం అందజేస్తున్న ఈవో, అర్చకులు

మహానంది, జూలై 27(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మహానందీశ్వరుడిని హైకోర్టు జడ్జి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా వీరికి ఆలయ ముఖ మండపం వద్ద తహసీల్దార్ రమాదేవి, ఆర్‌ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన, కోదండ రామాలయంలో నామార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో వేదపండితులు వీరిని ఆశీర్వదించారు. ఈవో శ్రీనివాసరెడ్డి జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులను శాలువాతో సన్మానించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు. వీరి వెంట నంద్యాల జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

మంత్రాలయం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ టీఎం నదాఫ్ కుటుంబ సమేతంగా ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట శ్రీపతి ఆచార్, అనంతపురాణిక్, ఎస్‌ఐ శివాంజల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ ఉన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకు మారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు వచ్చే అవసరం లేకుండా మీకు సమీపంలోని మండల, డివిజన్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తులను అందజేయవచ్చని, మీకోసం వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పీజీఆర్ఎస్‌కి అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాకు సముచిత స్థానం

7

కాలేయ వ్యాధితో ముప్పు...

● చాప కింద నీరుగా విస్తరిస్తున్న వ్యాధి

● ముందస్తు వ్యాక్సితో చెక్

నీట మునిగిన శ్మశానం

- మూడు నెలలు కష్టాలు తప్పవంటున్న ప్రజలు
- సమస్యను పరిష్కరించాలని వినతి



సంతజూటూరులో నీట మునిగిన శ్మశానం

బండిఆత్మకూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు గ్రామంలో హిందువుల శ్మశానం నీట మునిగింది. శ్మశానాన్ని కుందూనది నీటి ప్రవాహం చుట్టుముడుతుంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ పోతిరెడ్డిపాడు నుంచి వెలుగోడు రిజర్వాయర్‌కు వచ్చినంత కాలం, బనకచర్ల నుంచి కేసీకి నీటి విడుదల జరిగినంత మూడు నెలల పాటు శ్మశానం మునక నీటి నుంచి బయటపడదు. దీంతో ఈ మూడు నెలల కాలంలో మృతదేహాలను పూడ్చాలంటే గ్రామ శివారులో పూడ్చాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి దళితులకు శ్మశానం సైతం పికప్ ఆనకట్ట బ్యాక్‌వాటర్‌తో మునకకు గురవుతోంది. దీంతో దళితులు లింగాపురం దారిలోని వంక స్థలంలో దహన సంస్కారాలు చేస్తున్నారు. గ్రామంలో హిందువులకు, దళితులకు శ్మశానాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సంతజూటూరులో నెలకొన్న శ్మశాన సమస్యలు పరిష్కరించాలను గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించడం లేదు



హిందువుల, దళితుల శ్మశాన వాటికల సమస్యలు ఎన్నోసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో, ప్రస్తుతం ప్రజా గ్రీవెన్సులో ప్రజాప్రతినిధులకు వితి పత్రాలు ఇచ్చాం. శ్మశానాలు నీటి మునకలో ఉన్నంత కాలం ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ఈ సమయంలో గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న కట్ట వద్ద దహన సంస్కారాలు చేసుకోవాల్సి దుస్థితి నెలకొంది. అక్కడి సమీప పొలాల ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు.

- రామచంద్రుడు, సర్పంచ్

ఉద్యోగులంతా ఏకమై ఆందోళన చేస్తాం

- వ్యవసాయ ఉద్యోగుల సర్వీసు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికుమార్

కర్నూలు అగ్రికల్చర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగిపోయిందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యోగులంతా ఏకమై ఆందోళన చేస్తామని వ్యవసా య ఉద్యోగుల సర్వీసు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికు మార్ హెచ్చరించారు. ఆదివారం కర్నూలు నగరంలోని వ్యవసాయశాఖ కాన్ఫరెన్స్ హాల్లో సాయికుమార్ అధ్యక్షతన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. ఉద్యోగులకు సంబంధిం చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఏవిధమైన ఒత్తిడి పెంచాలనే విషయంపై చర్చించారు. పదవీవిరమణ చేసినవారి స్థానాల్లో కొత్తవారిని నియమిం చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం దారుణమన్నారు.



సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్న జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాష్‌కు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యవర్గం తరుపున, జిల్లా సంఘం తరుపున సన్మానించారు. వ్యవసాయ శాఖలో పని చేయుచున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు ఇప్పించిన రాష్ట్ర ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రకాష్, ఎంసీ కాశన్న, ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి పాల్గొన్నారు.

జలసవ్వడి.. జనసందడి



విడుదలవుతున్న నీరు

వెలుగోడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో వెలుగోడు జలాశయం గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సన్నివేశాలను చూసేందుకు పలు ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. దీంతో స్పిల్‌వే గేట్ల వద్ద జనసందడి రోజురోజుకు పెరుగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చి జలాశయాన్ని తిలకిస్తూ గేట్ల వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు.



1ఆర్ తూము వద్ద సందర్శకుల సందడి

యువకుడి బలవన్మరణం

- ప్రేమికురాలు ఆత్మహత్య చేసుకోవడంతో మనస్తాపం చెంది..
- చిప్పగిరి మండలం తిమ్మాపురంలో ఘటన


రాజు (ఫైల్)

ఆలూరు(చిప్పగిరి), జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెద్దలు కాదన్నారు. ప్రియుడు దూరమయ్యాడనే మనస్తాపంతో ప్రేమికురాలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలి ఆత్మహత్య విషయం తెలుసుకున్న ప్రియుడు ఇక తన ప్రియురాలు లేని లోకంలో నేనెందుకు అనుకుని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చిప్పగిరి మండలంలోని తిమ్మాపురం గ్రామంలో జరిగింది. వివరాలివీ.. తిమ్మాపురం గ్రామానికి చెందిన రాజు(28) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనంతపురం జిల్లాలోని గుంతకల్లులో ఓ ప్రైవేట కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు కులాలు వేరు కావడంతో అమ్మాయిని గట్టిగా మందలించడంతో మనస్తాపానికి గురైంది. ఆ యువతి గుంతకల్లులోని తన ఇంట్లో ఆదివారం ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన తల్లిదండ్రులు గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. చికిత్స పొందుతూ ఆ యువతి మృతి చెందింది. విషయం తెలియ డంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న యువకుడిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. చిప్పగిరి, గుంతకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం


ఎరువుల నిల్వల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు యాదవ్

ఆదోని అగ్రికల్చర్ , జూలై 27(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని డీసీఎంఎస్(ఉమ్మడి జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం ఆదోని మార్కె ట్‌యార్డ్‌లోని డీసీఎంఎస్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. యూరియా అం దుబాటులో లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నాలుగు రోజుల క్రితం సీఎం చంద్రబాబు కర్నూలు పర్యటనలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు. వెంటనే కలెక్టర్‌కు ఎరువులు కొరత లేకుండా చూడాలని సూచించారు అన్నారు. రెండు రోజు ల్లో డీసీఎంఎస్ కేంద్రాలకు, రైతు సేవా కేంద్రాలకు యూరియా కేటా యిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా అధికారులతో మాట్లాడామని, రైలు వ్యాగన్ నుంచి ఎరువులు వస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆదోని డీసీఎంఎస్‌కి అత్యధికంగా ఎరువులు కేటాయించా మని, 1500 మెట్రిక్ టన్నుల ఎరువులలో 750 టన్నుల ఎరువులను విక్రయిం చినట్లు తెలిపారు. రెండు రోజుల్లో మరో 350 మెట్రిక్ టన్నుల యూరియాను డీసీఎంఎస్ కేంద్రానికి సరఫరా చేస్తామన్నారు.

సైబర్ కేటుగాడి మాయాజాలం

- ఏఎస్ఐ పేరుతో రూ.50వేలు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

హొళగుంద, జూలై 27(ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్ల మాయాజాలానికి మరొకరు బలి అయ్యారు. ఏఎస్ఐ పేరు చెప్పి బాధితుడి నుంచి రూ.50వేలు వసూలుచేసిన ఘటన హొళగుందలో చోటుచేసుకుంది. బాధితుడు(పేరు చెప్పడం ఇష్టంలేని యువకుడు) తెలిపిన వివరాల మేరకు.. హొళగుంద పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న హనుమంతు అంటూ బాధితుడికి ఓ సైబర్ కేటుగాడు శనివారం ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. కర్నూల్ నుంచి మాట్లాతున్నానని, హొళగుంద పోలీస్‌స్టేషన్‌లో పని చేసే ఓ కానిస్టేబుల్ కూతురికి యాక్సిడెంట్ అయిందని తెలిపాడు. చికిత్స కోసం బెంగళూరుకి తీసుకువెళ్లాలని, తన వద్ద రూ.50వేలు డబ్బులు లిక్విడ్ క్యాష్ ఉందని నమ్మించాడు. ఫోన్ పేలో లేకపోడంతో నువ్వు రూ.50వేలు ఫోన్‌పేలో వేసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి డబ్బులు తీసుకోవాలంటూ చెప్పాడన్నారు. బాధితుడు ఫోన్‌పే ద్వారా అతడికి రూ.50వేలు డబ్బులు పంపించాడు. అనంతరం స్టేషన్‌కు వెళ్లి ఏఎస్ఐ హనుమంతు పేరుతో విచారించగా అలాంటి వారు ఎవరు ఇక్కడ లేరని పోలీసులు తెలిపారు. దీంతో బాధితుడు ఆశ్చర్యానికి గురయ్యాడు. మోసపోయానని గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపారు.


మల్లన్న సన్నిధిలో బిహార్ మంత్రి నితీశ్ మిశ్రా


మల్లన్న దర్శనానికి శ్రీశైలం చేరుకున్న బిహార్ మంత్రి నితీశ్ మిశ్రా


నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జున స్వామి వారిని బిహార్ పరిశ్రమలశాఖ మంత్రి నితీశ్ మిశ్రా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నితీశ్ మిశ్రా స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఆలయ అధికారులు, వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

కాలేయ వ్యాధితో ముప్పు..

- చాప కింద నీరుగా విస్తరిస్తున్న వ్యాధి
- ముందస్తు వ్యాక్సిన్‌తో చెక్
- నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం
- జిల్లా వ్యాప్తంగా 1200 మంది వ్యాధిగ్రస్థులు
- నేడు హెపటైటిస్ డే



శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో కాలేయం ఒకటి. ఆహారాన్ని జీర్ణం చేయడమే కాకుండా శరీరంలో ఉండే విష పదార్థాలను బయటకు పంపే శక్తి కాలేయం సొంతం. హెపటైటిస్ వైరస్ కారణంగా లివర్‌కు ముప్పు వాటిల్లుతుంది. కొన్నేళ్లుగా కాలేయ సంబంధిత సమస్యతో బాధ పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది సాధారణ భాషలో దీన్ని కామెర్లుగా పిలుస్తారు. ఏటా జూలై 28వ తేదీన ప్రపంచ హెపటైటిస్ డేను నిర్వహిస్తున్నారు. ప్రొఫెసర్ బ్లంబెర్గ్ జయంతి సందర్భంగా ఈ డేను ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'హెపటైటిస్ మనం విడమర్చి ఆలోచించుద్దాం' అన్న నినాదాన్ని ఇచ్చింది.



కర్నూలు హాస్పిటల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్ (కాలేయ) వ్యాధితో ముప్పు పొంచి ఉంది. కర్నూలు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి ప్రతి నెల 300 మంది హెపటైటిస్ బాధితులు వస్తుంటారు. ఈ వ్యాధి సోకితే ఆ విషయం బాధితులకు అంత తొందరగా తెలిపేలోగా చాలా నష్టం జరిగిపోతుంది. ముందస్తు వ్యాక్సినేషన్‌తో చెక్ పెట్టవచ్చు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది 1200 మంది హెపటైటిస్ వ్యాధిగ్రస్థులున్నారు. వీరిలో హెపటైటిస్ బీ బాధితులే ఎక్కువ. ఉమ్మడి జిల్లాలోని డోన్, ప్యాపిలి, పెద్దపూజర్ల, చిన్నపూజర్ల, ఆదోని డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు, తెలంగాణలోని గద్వాల, వనపర్తి జిల్లా నుంచి సైతం వ్యాధిగ్రస్తులు అధికంగా వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో హెపటైటిస్ వ్యాధిపై అవగాహన లేని కారణంగా ఎక్కువ మంది వ్యాధిబారిన పడుతున్నారు. మద్యపానం, కలుషిత నీరు, కలుషిత ఆహారం, రక్తమార్పిడి, అసురక్షిత సెక్స్‌తో ఈ వ్యాధి సంక్రమిస్తుంది.

ఐదు రకాల వైరస్‌లు..

హెపటైటిస్ ఏ, బీ, సీ, డీ, ఈ అనే ఐదు రకాల వైరస్‌ల వల్ల కాలేయ సమస్య ఏర్పడుతుంది. హెపటైటిస్ అంటే లివర్‌కు కలిగే వైరస్ ఇన్ఫెక్షన్. వీటిలో ఏ, డీ, ఈ వైరస్‌లు అంత ప్రమాదకరం కావు. ఇవి కలుషిత, ఆహారం, నీటిని తీసుకోవడంతో వస్తాయి. కొద్ది రోజుల పాటు పచ్చకామెర్లు వచ్చి తగ్గిపోతాయి. కానీ బీ, సీ వైరస్ మాత్రం ప్రమాదకరమైనవి. ఈవైరస్‌లను నిర్లక్ష్యం చేస్తే లివర్ సిరోసిస్ (క్యాన్సర్) దశకు చేరి ప్రాణహాని కలుగుతుంది.

హెపటైటిస్ బీ, సీతోనే..

హెపటైటిస్ బీ, సీ బారిన పడితే ఇబ్బందులు ఉంటాయి. హెపటైటిస్ బీ కలుషిత రక్తం, సిరంజి, సూదులు, వినియోగించడం అసురక్షితమైన లైంగిక సంపర్కం, తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుంది. ఈవ్యాధి బారిన పడిన వారిలో 80శాతం మందికి అసలు ఈ వ్యాధి ఉన్న విషయం తెలియదు. హెపటైటిస్ బీ బాధితుల్లో 20 శాతం లివర్ సిరోసిస్ (కాలేయం పూర్తిగా దెబ్బతిని పని చేయదు) బారిన పడుతారు. జనాభాలో హెపటైటిస్ బీ బాధితులు 3.5 శాతం మంది ఉన్నారు. ఇక హెపటైటిస్-సీ వ్యాధి ఇంట్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కుటుంబ సభ్యుల్లో ఎవరైనా పచ్చకామెర్లతో ఇబ్బంది పడుతున్న వారి నుంచి వస్తుంది. హెపటైటిస్ సీ బారిన పడిన వారిలో 80 నుంచి 90 శాతం లివర్ సిరోసిస్ దశకు చేరుతారు.

హెపటైటిస్-బీ కేసులు అధికం



హెపటైటిస్-బీ బాధితులు నెలకు 120 మంది దాకా గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగానికి వస్తుంటారు. హెపటైటిస్-సీ కేసులు 85 దాకా వస్తాయి. నేషనల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి హెపటైటిస్ బీ, సీ వైరస్‌లను నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకొంది. వరల్డ్ హెపటైటిస్ డేను పురస్కరించుకుని సోమవారం 250 మంది ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు వ్యాక్సిన్‌ను వేస్తున్నాం.

- డాక్టర్. జి.మోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, జీజీహెచ్, కర్నూలు.

సకాలంలో వైద్యం అందించకపోతే..



హెపటైటిస్ వైరస్ కాలేయానికి వచ్చే సమస్య. బీ, సీ వైరస్‌లకు సకాలంలో వైద్యం అందించకపోతే ప్రాణాంతకంగా మారుతాయి. హెపటైటిస్ నివారించడానికి మూడు డోసుల వ్యాక్సిన్‌ను తీసుకోవాలి. ప్రజలు హైపటైటిస్ బీ, సీ వైరస్‌పై జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ ఎ.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఇన్ఫెక్షన్ ఉన్న రక్తం ద్వారా...



ఇన్‌ఫెక్షన్ ఉన్న రక్తం ద్వారా ప్రధానంగా వ్యాపించే వ్యాధి ఇది. సరైన స్క్రీనింగ్ చేయకుండా రక్తమార్పిడి ఎంతో ప్రమాదం. వ్యాధి ఉన్నట్లు అసలు లక్షణాలు కనిపించవు. తీవ్రత పెరిగాక జ్వరం, అలసట, రుచి కోల్పోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటాయి. ప్రారంభ దశలో గుర్తించి వైద్యం చేయించుకోకపోతే సమస్య తీవ్రమై ప్రాణాంతకంగా మారుతుంది.

- డా.పి.అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

పారదర్శకంగా రుణాల మంజూరుకు కృషి

ప్రమాణ స్వీకారం చేసిన పసుపుల పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాముడు


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాముడు

కర్నూలు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు పారదర్శకంగా రుణాలు మంజూరు చేయించేందుకు తనవంతు కృషి చేస్తానని పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ బళ్లారి వెంకటరాముడు అన్నారు. కర్నూలు మండలం పసుపుల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సూదిరెడ్డిపల్లెలో ఆదివారం పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా బళ్లారి వెంకటరాముడు ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేడీసీసీబీ సీఈవో రామాంజనేయులు హాజరై వెంకటరాముడుతో చైర్మన్‌గా ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు కురువ రామకృష్ణ, చంద్రమౌళి ఇద్దరు రైతులను డైరెక్టర్ ప్రమాణం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తనపై నమ్మకంతో పదవి రావడానికి సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. దివంగత మాజీమంత్రి రాంభూపాల్‌చౌదరి ఆశీస్సులతో ఈస్థాయికి ఎదిగానని అన్నారు. టీడీపీకి 35ఏళ్ల పాటు సామాన్య కార్యకర్తగా పనిచేశానని పార్టీపెద్దలు గుర్తించి పదవి ఇచ్చారని ఆయన వివరించారు. ఈ సొసైటీ పరిధిలో దాదాపు 11 గ్రామాలు వస్తాయని ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల సంక్షేమ పథకాలను వర్తింపజేసి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం సూదిరెడ్డిపల్లెలో ర్యాలీగా వెళ్లారు. దివంగత మాజీ మంత్రి రాంభూపాల్‌చౌదరి తనయులు సుమన్, నవీన్, సొసైటీ మాజీ చైర్మన్ కేఈ వేమన్నగౌడ్, విశ్రాంత సీఈవో మురళీ, ఇన్‌చార్జి సీఈవో సతీష్, స్థానిక నాయకులు సత్యంరెడ్డి, బి.తాండ్రపాడు సర్పంచు ఆకెపోగు జయన్న తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా చేశారు

- బినామీ పేరుతో ఓ వైసీపీ నాయకుడు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు
- తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేసిన బాధితుడు


ఆన్‌లైన్‌లో చేయించుకున్నారని చూపుతున్న దళిత యువకుడు మౌలాలి

కోసిగి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఓ వైసీపీ నాయకుడు బినామీ పేరుతో ఆన్‌లైన్ ఎక్కించి తమ భూమిని భూకబ్జా చేశారని కందుకూరు గ్రామానికి చెందిన దళిత యువకుడు మౌలాలి ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన తన తాత హరిజన ఎల్లప్పకు 1970లో కడిదొడ్డి గ్రామ సర్వేనెం.25/ఏ1లో రెండెకరాల 42 సెంట్లు ప్రభుత్వ పట్టా ఇచ్చిందని చెప్పారు. తన తాత, తల్లిదండ్రులు సాగు చేశారని , వారి మరణానంతరం తాను పత్తి పంట వేసి సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అడంగల్ ఆర్‌వోఆర్‌లో తన తాత ఎల్లప్ప పేరు కాకుండా గంగాధర్ స్వామి అనే పేరు మీద ఉండటంతో అవాక్కు అయినట్లు తెలిపారు. ఈ విషయంపై విచారించగా వైసీపీ నాయకుడి ఇంట్లో పని చేసే కర్ణాటకకు చెందిన గంగాధర్ స్వామి అని తేలిందన్నారు. తనకు జరిగిన ఈ అన్యాయాన్ని తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ హనుమంతరెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

వివరణ: ఇదే విషయమై కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్‌ను వివరణ కోరగా బాధితుడు మౌలాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించామన్నారు. గతంలో వీరి తాతకు ప్రభుత్వం సర్వేనెం.25ఏ1లో రెండెకరాల 42 సెంట్లు భూమి కేటాయించిందన్నారు. ఇప్పుడు మాత్రం ఆన్‌లైన్‌లో గంగాధర్ స్వామి అనే వ్యక్తి పేరు ఉందని, వీఆర్వో ద్వారా ఆయనకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. పూర్తిగా విచారించి ఆన్‌లైన్‌లో రికార్డులను తారుమారు చేసిన వారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాకు సముచిత స్థానం

- స్త్రీశిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా గౌరు చరిత
- ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్‌గా బీటీ నాయుడు
- మరో రెండు కమిటీల్లోనూ సభ్యుడిగా బీటీ
- పలు కమిటీల్లో సభ్యులుగా ఎమ్మెల్యేలకు చోటు

కర్నూలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసన సభ, శాసనమండలి ఉభయ సభలకు సంబంధించి తొమ్మిది సంయుక్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలకు సముచిత స్థానం కల్పించారు. ఈకమిటీల చైర్మన్లు, సభ్యులను ఆదివారం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ప్రకటించారు. శాసనసభల్లో ఓ కమిటీకి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను చైర్ పర్సన్‌గా నియమిస్తే.. శాసన మండలిలో కీలకమైన ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బీటీ నాయుడును నియమించడం రాజకీయంగా ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత దక్కినట్లయింది. పలు కమిటీల్లో ఎమ్మెల్యేలను సభ్యులుగా నియమించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కమిటీలు నియమించినట్లు తెలుస్తుంది. 2025-26 సంవత్సరానికి ఏడాది కాలం కొనసాగేలా ఈ కమిటీలను నియమించినట్లు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.


గౌరు చరిత

- శాసనసభ స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటి చైర్ పర్సన్‌గా పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని నియమించారు. 11 మంది సభ్యులను నియమించారు. స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఈ కమిటీ పని చేస్తుంది. వారి అభ్యున్నతి కోసం శాసనసభలో పలు బిల్లులు పెట్టేందుకు కీలకమైన సూచనలు చేయడంతో పాటు హక్కుల కోసం కృషి చేస్తుంది.
- శాసనమండలిలో అత్యంత కీలకమైన ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ బెందుల తిరుమలనాయుడు (బీటీ నాయుడు)ను నియమించారు. సభ్యుల హక్కుల రక్షణలో ఈ కమిటీ ప్రత్యేకంగా పనిచేస్తుంది. సభ్యులు సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకోవడంతో పాటు సమస్య తీవ్రంగా ఉంటే సస్పెండ్ చేసే అవకాశం కూడా ఉంది. సభా వ్యవహారాల నిర్వహణలో అత్యంత కీలకమైన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు చైర్మన్‌గా ఉన్న సభా నియమాల కమిటీలోనూ, వన్యప్రాణులు-పర్యావరణ పరిరక్షణ కమిటీలో కూడా బీటీ నాయుడును సభ్యుడిగా నియమించారు.


బీటీ నాయుడు


జయసూర్య

- గిరిజన సంక్షేమ కమిటీ సభ్యుడిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు అవకాశమిచ్చారు. ఈయన ప్రాతినిథ్యం వహించే నియోజకవర్గ ప్రాంతంలో గిరిజనులు అధికంగా ఉన్నారు.
- శాసనసభలో ఎమ్మెల్యే బీద రవిచంద్ర చైర్మన్‌గా ఉన్న బీసీ సంక్షేమ కమిటీలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును సభ్యుడిగా నియమించారు. అలాగే గ్రంథాలయ కమిటీలోనూ సభ్యుడిగా నియమించారు. రెండు కమిటీల్లో సభ్యుడిగా నియమించడం కొసమెరుపు.


కేఈ శ్యాంబాబు


బుడ్డా రాజశేఖరరెడ్డి

- శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు చైర్మన్‌గా ఉన్న వన్యప్రాణులు- పర్యావరణ పరిరక్షణ కమిటీలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని సభ్యుడిగా నియమించారు. ఈ నియోజకవర్గం వన్యప్రాణులకు నిలయం. వాటి సంరక్షణకు కమిటీ సభ్యుడిగా పని చేసే అవకాశం వచ్చింది. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే బి.విరుపాక్షిని మైనార్టీ సంక్షేమ కమిటీ సభ్యుడిగా నియమించారు.


బి.విరుపాక్షి

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఆత్మకూరులో పోలీసుల తనిఖీలు

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అర్బన్ సీఐ రాము ఆయా గ్రామాల్లోని అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టి సరైన ధ్రువీకరణపత్రాలు లేని 12 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బెల్టు షాపులను గుర్తించి వారి వద్ద నుంచి నాలుగు బీర్‌బాటిళ్లు, నాలుగు మద్యం సీసాలను సీజ్ చేశారు. ఎవరైనా అవాంఛనీయ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'అక్రమ బదిలీలపై విచారణ జరపాలి'

నంద్యాల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గతనెలలో జరిగిన సచివాలయ ఉద్యోగుల బదిలీలపై విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అక్రమ బదిలీలపై విచారణ జరపాలని, లేనిపక్షంలో ఆధారాలతో సహా లోకాయుక్త ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం జీవో నెం.5 ను ఉల్లఘించి సచివాలయ ఉద్యోగులను బదిలీ చేసిందని, రాజకీయ ఒత్తిళ్లకు లోనై అక్రమ బదిలీలు చేశారని ఆరోపించారు. విచారణ జరిపి, నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

భారత్ కీర్తిని ప్రపంచానికి చాటాలి

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అఖండ భారతీయ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని భారత్ దర్శన్ జిల్లా ప్రముఖ్ నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీచౌడేశ్వరి దేవి కల్యాణ మండపంలో భారత్ దర్శన్ కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేల సంవత్సరాల క్రితం ఎంతో వైభవంగా విరాజిల్లిన అఖండ భారత్ పరాయి దేశాల పాలకుల స్వార్థ ప్రయోజనాల కోసం అనే దేశాలు గా విభజనకు గురి కావడం బాధాకరమన్నారు. అయితే ప్రస్తుత భారత్‌ని కూడా విభజించాలని కొన్ని దేశాలు కుట్ర పన్నుతున్నా యని అన్నారు. ఈ పరిస్థితుల్లో అఖండ భారత్ గొప్పతనాన్ని గుర్తించడంతో పాటు ప్రస్తుతం మన దేశంపై ఇతర దేశాలు పన్నుతున్న కుట్రలను ప్రతి ఒక్క దేశ పౌరుడు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే క్రమంలో అనేక చారిత్రాత్మక, ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు సముద్రాలు, నందులు సరస్సులు, ఇతర ప్రకృతి వనరులతో భారత్ పుణ్యభూమిగా విరాజి ల్లుతుందని వివరించారు. అంతేగాకుండా ఎంతో మంది పురాతన, ఆధునిక శాస్త్రవేత్తల జ్ఞాన సంపదతో భారత్ జ్ఞానభూమిగా ప్రపం చంలోనే ఎంతో గొప్ప కీర్తి ప్రతిష్ఠలను సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ఆత్మకూరు అఖండ ఆర్ఎస్ఎస్ కార్య వాహ వాసుదేవరెడ్డి, జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కృష్ణార్జున రెడ్డి, అర్చకులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు ఉన్నారు.



భారత్ గొప్పదనాన్ని వివరిస్తున్న జిల్లా ప్రముఖ్ నాగార్జునరెడ్డి

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమలాపురం గ్రామ పంట కాలువల్లో ఆదివారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి ఆత్మకూరు అర్బన్ సీఐ రాము తెలిపిన వివరాల మేరకు ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామానికి చెందిన మంగళ నాగభూషణం అనే వ్యక్తికి మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో పాటు ఇతనికి అప్పుడప్పుడు మూర్ఛవ్యాధి ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే భార్య అతడి నుంచి విడిపోయి నందికొట్కూరులో తన తల్లి వద్ద ఉంటుంది. అయితే మూడు రోజుల క్రితం నాగభూషణం అమలాపురం గ్రామ పంట పొలాల్లో కూలీలకు కనిపించారు. ఆదివారం ఆయన విగతజీవిగా కనిపించడంతో పొలం యజమాని మౌలాలి గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అర్బన్ సీఐ రాము సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

జూపాడుబంగ్లా, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నందికొట్కూరు-మండ్లెం గ్రామాల మధ్యలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు . జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి (35) అనే వ్యక్తి పనినిమిత్తం నందికొట్కూరుకు మోటారుసైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

• ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి

కొత్తపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి హెచ్చరించారు ఆదివారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో స్థానిక ఎస్ఐ జయశేఖర్, పోలీసు సిబ్బందితో సీఐ కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ముందుగా గ్రామంలోని అనుమానితుల గృహాలను తనిఖీలు చేశారు. ఈ గ్రామంలో బోయ వెంకటరమణ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 మద్యం క్వాటర్‌బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. అలాగే సారా, మద్యం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అల్లర్లు సృష్టించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. అలాగే గ్రామంలో 13 ద్విచక్రవాహనాల రికార్డు పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



గువ్వలకుంట్లలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నిత్యాన్నదానానికి విరాళం

పాణ్యం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు దేవస్థాన ఆలయ అన్నదానానికి భక్తులు రూ. 50వేలు విరాళంగా అందజేశారు. ఆదివారం కడప జిల్లా పెద్దముడియం మండలం భూతమాపురం గ్రామానికి చెందిన పట్నం లక్ష్మయ్య కుటుంబ సభ్యులు ఈఓ రామకృష్ణకు రూ. 50వేలు విరాళంగా అందజేశారు. అంతకుముందు దాతలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సిబ్బంది సుబ్బారెడ్డి ఉన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

అడవి బిడ్డలకు అన్నీ కష్టాలే..!

- నల్లమలలో నలుగుతున్న గిరిజన కుటుంబాలు
- తీరని మంచినీటి కష్టాలు
- చీకటి పడితే ఇంటికే పరిమితం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గాలివానకు కూలిన గుడిసె, ఇన్‌సెట్‌లో గూడెంలో మురుగు



మహానంది, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అడవి బిడ్డలను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకొస్తామని చెబుతున్న ప్రజాప్రతినిధుల మాటలు నీటిమూటలవుతున్నాయి. అనాధిగా అడవినే నమ్ముకొని అడవికి రక్షణతో పాటు వారి జీవనం కొనసాగేందుకు చెట్లక్రిందే ఆవాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న అడవి బిడ్డలకు అడుగడుగున కష్టాలే ఎదురవుతున్నాయి. అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఐటీడీఏ సంస్థను ఏర్పాటు చేసినా ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమో, పాలకుల అలసత్వమో కానీ వారి బతుకులు మాత్రం మారడం లేదు. పేరుకే అడవి బిడ్డలుగా పిలువబడే వారికి అటవీశాఖ అధికారుల నుంచి అడుగడుగున అడ్డంకులే ఎదురవుతున్నాయి.

అడవి బిడ్డలకు అన్ని కష్టాలే..

ఐదుజిల్లాల పరిధిలో నల్లమల అడవులు వ్యాపించి ఉన్నాయి. ఇక్కడ ఔషధ గుణాలకు చెందిన మొక్కలు, వేర్లు లభిస్తుంటాయి. ఆదివాసులు ఆలయాలను, అడవిలో ఉండే విలువైన కర్రను కాపాడుకొంటూ జీవన విధానాన్ని అడవి తల్లి కోసం అంకితం చేశారు. కాలక్రమేణ వారిని జనజీవనంలోకి మార్చుకావాలని అడవినుంచి జనారణ్యంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాలకు సమీపంలో ప్రత్యేకంగా ఇళ్లను నిర్మించి అడవి నుంచి బయటకు రప్పించారు. అయితే నేటికి కొన్ని చెంచుగూడెంలు అడవిని నమ్ముకొని అక్కడే ఉండిపోయారు. అందులో మహానంది సమీపంలోని చెంచులక్ష్మి చెంచుగూడెం ఒకటి. దాదాపు 70 కుటుంబాలు గుడిసెల్లో నివాసం చేస్తున్నారు. ఈ ఆధునీక కాలంలో కూడా మంచినీటికి, విద్యుత్ కాంతులకు నోచుకోవడం లేదు. కనీసం స్వచ్ఛమైన తాగునీరు దొరకడం లేదు. తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి ప్రవహిం చే నీటిని వినియోగిస్తున్నారు. దీంతో రకరకాల వ్యాధులకు గురవుతున్నారు. గూడెంకు విద్యుత్ సౌకర్యం లేదు. చీకటి పడితే ఇళ్లకే పరిమితమ వుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు



ఇళ్లపట్టాలు ఇవ్వాలి

ఎన్నో ఏళ్లుగా గూడెం ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నాం. తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి. మంచి నీటితో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలి. మౌలిక వసతులు కల్పించి సమాజంలో తమకు ఓ గుర్తింపు ఇవ్వాలి.

-శ్రీనివాసులు, చెంచులక్ష్మి గూడెం నాయకుడు

పట్టాలు ఇవ్వడానికి కుదరదు

మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గూడెంకు చెందిన గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వడానికి కుదరదు. గిరిజనులకు కేవలం సాగు చేసుకొని జీవించేందుకే అటవీ భూములు కేటాయించాం.

- రమాదేవి, తహసీల్దార్

అటవీ స్థలంలో నివసించడానికి అంగీకరించం

అటవీ హక్కుల చట్టం ప్రకారం అటవీ స్థలంలో నివసించడానికి ఎలాంటి పరిస్థితుల్లో అంగీకరించం. గిరిజనులకు కేవలం జీవనాపాధికు సాగు కోసం అటవీ భూములను కేటాయించారు. అదే స్థలం గిరిజనులు ఇళ్ల వేసుకొని జీవించడానికి కుదరదు. దీనివల్ల వన్యప్రాణులకు ఇబ్బంది కలుగుతుంది.

- అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ జఢ్‌ఈనర్ఖూ

సౌకర్యాలు కల్పించాలి

అడవిని నమ్ముకొని గూడెంలో నివసిస్తున్నాం. ఏ అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదు. కనీస వసతులు కల్పించాలి.

- మేకల అంకమ్మ(గూడెం మహిళ)



చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె మండలంలోని నెరవాడ, ఆలమూరు, కొనిదేడు గ్రామాలలో ప్రభుత్వ పాలనపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. నెరవాడలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం, ప్రభుత్వ పనితీరు తెలుసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చిందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు త్వరలో కల్పిస్తామన్నారు. వైసీపీ పాలనతో అన్ని వర్గాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. పాణ్యం మండలంలో ఇప్పటికే రూ. 20 కోట్లతో రహదారులు, తాగునీరు, మురుగుకాల్వలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నెరవాడ రైల్వే వంతెన సమస్యను పరిశీలించారు. వంతెన కింద రాకపోకలకు అనువైన రహదారిని ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులను కోరామన్నారు. తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీటీసీలు రంగరమేష్, భాస్కరరెడ్డి, సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, కన్వీనర్ జయరామి రెడ్డి, అమరసింహారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మునీశ్వర రెడ్డి, ప్రతాపరెడ్డి, రామగోవిందరెడ్డి, రాంపుల్లారెడ్డి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

మినీగురుకుల పాఠశాల అభివృద్ధికి నిధులు

పాణ్యం మండలంలోని బలపనూరు పరిధిలోని మినీ గిరిజన గురుకుల పాఠశాల అభివృద్ధికి ఐటీడీఏ నిధుల రూ. 40 లక్షలు కేటాయిస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత హామీ ఇచ్చారు. ఆదివారం ఆమె గురుకుల పాఠశాలను తనిఖీ నిర్వహించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ నిర్వహించి పాఠశాల సౌకర్యాలు, ఆహారాన్ని పరిశీలించారు. ఎంఈవో సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ కృష్ణానాయక్, ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, ఎంపీటీసీ భాస్కరరెడ్డి, శివశంకరరెడ్డి పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం



దామగట్లలో కరపత్రాన్ని ఇస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

• ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే పింఛన్లను అత్యధికంగా పెంచి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని, ఇది ప్రజా ప్రభుత్వమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం మండలంలోని దామగట్ల గ్రామంలో సర్పంచ్ మాదవరం సుశీలమ్మ, నాయకులు ఏసురత్నం, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ కరపత్రాలను పంచుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలకు ఇచ్చిన హామీలను దాదాపుగా నెరవేరుస్తూ వస్తున్నామని ప్రజలకు తెలియజేశారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. అన్నిటిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, డీలర్ చందర శేఖర్, మాజీ సర్పంచ్ రంగస్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మహాసభలో పాల్గొన్న యూనియన్ నాయకులు

నంద్యాల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏపీ పకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం రామకృష్ణారెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 12నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకుని వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రకృతి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, నిర్మల, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సుంకయ్య, అధ్యక్షులుగా నిర్మల, ఉపాధ్యక్షులుగా కరిముల్లా, ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రామ్‌మద్దయ్య, తొమ్మిది మంది సభ్యులను ఏకగ్రీవగా ఎన్నుకున్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

• బీజేపీ నంద్యాల రూరల్ మండల అధ్యక్షుడు గురుబ్రహ్మం

నంద్యాల కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నంద్యాల పర్యటనకు వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీని జయప్రదం చేయాలని ఆ పార్టీ నంద్యాల రూరల్ మండల అధ్యక్షుడు గురుబ్రహ్మం కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పద్మావతి నగర్ నుంచి సౌజన్య కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో శివారెడ్డి, రామచంద్రారెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, కిసాన్ మోర్చా సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు సున్నిపెంట గ్రామంలోని భవన నిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నాగిరెడ్డి, అధ్యక్షుడిగా అన్వర్‌బాషా, కార్యదర్శిగా పుష్పరాజ్, ట్రెజరర్‌గా రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా మల్లి, జమీల్, నారాయణ, సంజీవయ్య, గురువయ్య, మల్లికార్జునలతో పాటు కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వీపనగండ్లలో పోలీసుల సోదాలు

మిడుతూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో ఎస్ఐ ఓబులేసు ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానితుల ఇళ్లలో, ప్రదేశాల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఏడు వాహనాలను సీజ్ చేశారు. నవీన్ అనే వ్యక్తి వద్ద నుంచి 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా మెలగాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకునివెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హరిప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరా



చెక్కును అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు ఆసరా అని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో పట్టణంలోని నడిగడ్డకు చెందిన షేక్ యూసుబ్‌బాషా కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ కింద రూ1,74,958 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సత్రం కమిటీ ఎన్నిక



రవికుమార్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

• జనరల్ సెక్రటరీగా నెరవాటి రవికుమార్

మహానంది, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. మహానందిలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం కమిటీ భవనంలో ప్రముఖులు సమావేశం నిర్వహించారు. వంశపారంపర్య అధ్యక్షుడిగా ఆత్మకూరు సుదర్శనం శెట్టి, జనరల్ సెక్రటరీగా నెరవాటి రవికుమార్, అదనపు జనరల్ సెక్రటరీగా రాచమడుగు వెంకటసుబ్బయ్య, కోఆర్డినేషన్ చైర్మన్‌గా బింగుమళ్ళ సుబ్బలక్ష్మయ్య, చిత్తులూరు శేషఫణి, కేవీఎస్ కృష్ణమూర్తి, కాల్వ నాగరాజు, కోశాధికారిగా పరుచూరి కొదండపాణి, సహాయ కోశాధికారిగా మల్లికార్జున, రాజశేఖర్‌తో పాటు ఉపాధ్యక్షులుగా శరణా రాధాకృష్ణ, కార్యదర్శిగా భవనాశి రమణయ్య, ఇతర విభాగాల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుం దన్నారు. అనంతరం సత్రం సంఘం నూతన కమిటీ సభ్యులను ఆర్యవైశ్య ప్రముఖులు సన్మానించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



కాలువను పరిశీలిస్తున్న నాయకులు

నందికొట్కూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి నగర్, వడ్డేపేట, కుమ్మరి పేట, శేసశయానారెడ్డి నగర్, తదితర కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించారు. మున్సిపాలిటీలో ఆధిపత్యం కోసం గ్రూపు రాజకీయాలు కడుతూ అభివృద్ధిపై శ్రద్ధ పెట్టడం లేదన్నారు. అనేక కాలనీల్లో అభివృద్ధి కుంటుపడిందని, ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందగా తయారైందని ఆరోపించారు. పాలకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కుమ్మరిపేటలో సామూహిక మరు గుదొడ్డి కూల్చివేయాలని డిమాం డ్ చేశారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. గోపాలకృష్ణ, ఎస్.ఉస్మా న్‌బాషా, దూదేకుల బాబు, అబ్దుల్ రషీద్, మధుగౌడ్, గోకారి, కృష్ణ, రాధమ్మ, వెంకటరమణ ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించకపోతే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న రమేష్ కుమార్

ఆత్మకూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను తొలగించకపోతే దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రజా సంఘాల నాయకులు రమేష్ కుమార్, నరసింహ నాయక్, రణదీర్, సురేంద్ర, రజాక్‌లు పేర్కొన్నారు. ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదానితో రూ.1750 కోట్ల లంచం తీసుకుని ఒప్పందం చేసిందని, ఇప్పుడు అదే ఒప్పందాన్ని అమలు చేస్తూ ప్రజలపై భారంగా వేసిందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల వల్ల బారీ బిల్లులతో ప్రజలు, చిరు వ్యాపారులు కష్టాలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసి స్మార్ట్ మీటర్ల తొలగింపు చర్యలు ప్రారంభించకపోతే ఆగస్టు నెలలో ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

కూడు, గూడు లేక గిరిజనుల అవస్థలు



సమావేశంలో ప్రసంగిస్తున్న శంకర్‌నాయక్

• జీవీఎస్ జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్

నంద్యాల రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చి నేటికీ 78 సంవత్సరాలు కావస్తున్న గిరిజనులు కూడు గూడు లేక నానా అవస్థలు పడుతున్నారని జీవీఎస్ జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని సూరజ్ హోటల్‌లో గిరిజన సంఘాల ముఖ్య నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీ జాబితాలో ఇతర కులాలను చేర్చితే సహించేది లేదని హెచ్చరించారు. మైదాన గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు కేటాయిస్తున్న నిధులను సైతం పక్కదారి పట్టిస్తున్నా రని ఆరోపించారు. రాజకీయంగా మన్యం ప్రాంతాల గిరిజనులకు పరిమితం చేయడం వల్ల మైదాన ప్రాంత గిరిజనులు గత 50 ఏళ్లుగా దూరంగా ఉన్నారని రాజకీయంలో మైదాన ప్రాంత గిరిజనులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. హక్కుల కోసం సంఘటి తంగా పోరాడదామని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను గుర్తించాలన్నారు. సమావేశంలో జీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, కార్యదర్శి రవినాయక్, జాతీయ ఉపాధ్యక్షుడు సాయినాయక్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి కుంభాభిషేకం



గ్రామోత్సవం పాల్గొన్న గ్రామ పెద్దలు

కొలిమిగుండ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారు జీర్ణోద్ధరణ చేపట్టిన ప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం మహాసంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. నూతనంగా ప్రతిష్ఠించే విగ్రహాలు, కలశాలను గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, ఋత్విక్ వరుణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ హోమాలు తదితర పూజలను వేద పండితుల మంత్రోచ్చారణలతో నిర్వహించారు. కార్యక్రమంలో రామ్‌కో ప్రతినిధులు, గ్రామ సర్పంచ్ శివరాముడు, పెద్దలు పేరం బయ్యపురెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బీగాల వెంట సుబ్బయ్య, నరేంద్ర, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, బయ్యన్న, వేద పండితులు రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు

డోన్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు అని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. ఆదివారం స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించి వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు మధు, గోవిందరెడ్డి, భాస్కర్, మోహన్‌గౌడు, మోహన్ రెడ్డి, చింతలయ్య, సీసంగుంతల రంగ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి వాహనదారుడికి లైసెన్స్ తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

డోన్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని అర్బన్ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని కంబలపాడు సర్కిల్ వద్ద ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసుసిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. వాహనపత్రాలు, లైసెన్సులు లేనివారికి తనిఖీలు చేసి జరిమానాలు విధించారు. కానిస్టేబుల్ ధనుంజయ, హోంగార్డు నాగరాజు, జిలాని, భాస్కర్, రామాంజులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కోవెలకుంట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని బీసీ బాలికల జూనియర్ కళాశాల హాస్టల్‌లో వార్డెన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్సై నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వభ్య సమావేశం

ఆళ్లగడ్డ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. సమావేశానికి చాలామంది అధికారులు గైర్హాజరయ్యారు. పలువురు అధికారులు ప్రగతినివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో నూర్జహాన్, మండల ఉపాధ్యక్షుడు నరసింహ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి వెంకట రమణ, మండల వ్యవసాయాధికారి కిశోర్, విద్యుత్ ఏఈ హుసేన్‌బాష, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

శిలాఫలకంపై కోట్ల ముఖం చెరిపివేత

● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు

ప్యాపిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపూదిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై డోన్ ఎమ్మెల్యే కోట్ల ముఖాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చెరిపేశారు. దీంతో ఆ గ్రామ టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరుతున్నారు.



శిలాఫలకంపై కోట్ల ముఖాన్ని చెరిపేసిన దృశ్యం

కబడ్డీ విజేతగా కర్నూలు జట్టు

బేతంచెర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సరస్వతి విద్యాపీఠం కర్నూలు విభాగం ఆటల పోటీల్లో ప్రథమ విజేతగా కర్నూలు కబడ్డీ క్రీడాకారులు, ద్వితీయ స్థానంలో బేతంచర్ల సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. పోటీల్లో సుమారు ఎనిమిది విద్యాపీఠం పాఠశాలలు పాల్గొన్నాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అతిథులు కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, వేణుగోపాల్, రాధాకృష్ణమూర్తి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలల నిర్వాహకులు గుండా గోపాల్, మారుతి కృష్ణన్, విజయ నాగరాజు, రోటరీ క్లబ్ అధ్యక్షులు అశ్వర్థ నారాయణ, నరేష్, సత్తార్, మాణిక్యం శెట్టి, మధు మోహన్ రెడ్డి, ప్రేమ స్వరూప్, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న మహిళా శిల్పి

ఆళ్లగడ్డ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ శ్రీ శారదా శిల్ప కళా మందిరం శిల్పి దురుగడ్డ భువనేశ్వరికి బ్రాండ్ ఆఫ్ ఇండియా 2025 అవార్డు లభించింది. హైదరాబాద్ లో నిర్వహించిన అభినందన సభలో ఎసీయూఫ్ సంస్థ వారు శిల్పి భువనేశ్వరిని జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శిల్పి భువనేశ్వరిని ఆళ్లగడ్డ విశ్వబ్రాహ్మణ సంఘం, కాళిమాత ఆలయ కమిటీ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

పంపిణీకి నోచుకోని చెత్త బుట్టలు

ఉయ్యాలవాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో చెత్త బుట్టలు పంపిణీకి నోచుకోవటం లేదు. గతేడాది సెప్టెంబరులో స్వచ్ఛభారత్ కింద చెత్త బుట్టలు మంజూరు అయ్యాయి. గ్రామ పంచాయతీ భవనంలో 10 నెలల నుంచి అలాగే మూలకు పడేశారు. దీనిపై ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి మాలతీని వివరణ కోరగా గ్రామంలో 464 కుటుంబాలు ఉండగా కేవలం 386 బుట్టలు మాత్రమే మంజూరు అయ్యాయన్నారు. కనీసం ఇంటికి ఒకటి ఇచ్చినా సరిపోవన్నారు. మిగితావి మంజూరు అయిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు.



పంచాయతీ కార్యాలయంలో ఉంచిన చెత్తబుట్టలు

చెరువులు కబ్జా

● పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
● పర్క్యులేషన్ ట్యాంకుగా మార్చాలి

బనగానపల్లె, జూలై 27(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె డివిజన్‌లో చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఏళ్లగా ఈ తతంగం సాగుతున్నా మైనర్ ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న దాఖలు లేవు. పట్టణ సమీపంలోని రాచెరువు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. మైనర్ ఇరిగేషన్ అధి కారులు చెరువు ఆక్రమణదారులపై నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుం టున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు రాచెరువు భూములకు నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చారు. దీంతో మిగిలిన భూమిని మరికొందరు దర్జాగా ఆక్రమిం చేశారు. అలాగే జుర్రేరు వాగుతో పాటు పలు చెరువులను కబ్జాదారులు ఆక్రమించుకున్నారు.



ఆక్రమణకు గురైన రా చెరువు



ఆక్రమణకు గురైన వాగు

కబ్జా కోరల్లో రా చెరువు..

బనగానపల్లె మండలంలోని 99, 100, 101, 102, 103 సర్వేనంబర్లలో వంద ఎకరాల్లో రాచెరువు విస్తీర్ణం ఉన్నది. సర్వే నంబర్ 99, 102, 103లో చెరువు కట్ట ఉంది. పట్టణానికే గాక చుట్టుపక్కల గ్రామాల సాగు, తాగునీటి సమస్య తలెత్తకూడదనే సదుద్దేశంతో చెరువు ఏర్పాటు చేశారు. 1977లో అప్పటి రెవెన్యూ అధికారులు చెరువులోని 40 ఎకరాలు 40 మందికి నిబంధనలకు విరుద్ధంగా పట్టాలిచ్చేశారు. మిగిలిన చెరువు స్థలం 60 ఎకరాలు కూడా కబ్జాదారుల చేతిల్లోకి వెళ్లిపోయింది. గతంలో ఆక్రమణదారులకు మైనర్ ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. తాము పొలాలను సాగు చేసుకుంటున్నామని, మైనర్ ఇరిగేషన్ శాఖాధికారుల పైనే గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో అధికారులు తమకెందుకులే అని పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు చెరువు భూములను పూర్తిగా ఆక్రమించేశారు. అలాగే మండలంలోని తమ్మడపల్లె చెరువు విస్తీర్ణం వంద ఎకరాలు కాగా, 48ఎకరాల వరకు ఆక్రమించేశారు. దద్దనాల చెరువు, కుక్కలగంటి చెరువు, పసుపుల చెరువు, మద్దిలేటయ్య స్ప్రింగ్ ఛానల్, అక్కాజమ్మచెరువు, రామతీర్థం చెరువు, ఇల్లూరు కొత్తపేట స్ప్రింగ్ ఛానల్ చెరువులు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. అలాగే అవుకు మండలంలోని వేములపాడు చెరువు, మెట్టుపల్లె చెరువు, శింగనపల్లె, సంగపట్నం చెరువులు కొంత మేర ఆక్రమణకు గురయ్యాయి. జుర్రేరు వాగు, వంకలు సైతం అక్రమార్కులు ఆక్రమించేస్తున్నారు.

సమ్మర్ స్టోరేజీగా మార్చాలి

కబ్జాకోరల నుంచి రాచెరువును కాపాడి సమ్మర్ స్టోరేజీగా మార్చాలని పలువురు కోరుతున్నారు. వంద ఎకరాలు గల రాచెరువుకు ఎస్సార్బీసీ, లేదా గాలేరునగరి ద్వారా ఎత్తిపోతల ద్వారా సులభంగా నీరందించవచ్చన్నారు. రాచెరువులో నీరుంటే బనగానపల్లె, బత్తులూరుపాడు, యనకండ్ల, మీరాపురం, యాగంటిపల్లె గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని, బోర్లలో పుష్కలంగా నీరుండి ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుదన్నారు.

ఆక్రమణ నిజం

గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారు. తాము ఏం చేయలేకపోతున్నాం. నోటీసులు ఇచ్చాం. అయితే తమపైనే పోలీసులకు పట్టాదారులు ఫిర్యాదులు చేశారు. రెవెన్యూ అధికారులు పట్టాలు క్యాన్సిల్ చేస్తే తాము రాచెరువును రక్షించుకోగలం.

\- కె రామ్మోహన్ రెడ్డి, ఏఈ, మైనర్ ఇరిగేషన్

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తిప్పికొట్టాలి: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి గృహ వినియోగదారులపై పాలక ప్రభుత్వాలు విద్యుత్ భారాలను మోపుతున్నాయని, మీటర్ల ఏర్పాటును తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు వై.ఎల్లయ్య సూచించారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు పి.రామాంజనేయులు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజల మెడలకు ఉరితాళ్లు బిగిస్తోందని, వ్యాపార సముదాయాలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను బిగించడం పూర్తి చేసిన ప్రభుత్వం 200 యూనిట్ల నుంచి పైబడి విద్యుత్ బిల్లు వచ్చే గృహ వినియోగదారులకు స్మార్ట్‌మీటర్లను బిగించేందుకు కుట్ర చేస్తుందన్నారు. అలాగే జగన్ బినామీ కోసం ఎనిమిది వేల ఎకరాలు కేటాయించారని ఆందోళనలు చేసిన టీడీపీ ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక ఆ ఎనిమిది వేల ఎకరాలను కేటాయిస్తూ ఏకంగా నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రజల చెవుల్లో పూలు పెట్టి పెట్టుబడిదారుల చేతుల్లో భూములు పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజా సంక్షేమానికి హాని తలపెట్టే ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, నాయకులు టి.శివరాం, బి.నాగమద్దయ్య, ఏవీ భాస్కర్‌రెడ్డి, శివ, రంగస్వామి, మధు నాయుడు, శ్రీను, లోక్‌నాథ్, నరసింహులు పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కలు

● అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు ..



ఎంపీడీవో కార్యాలయంలో ఎండిపోతున్న మొక్కలు

కొలిమిగుండ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయం సాక్షిగా ఎండుతున్న మొక్కలు అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతున్నాయి. ప్రభుత్వం ఓవైపు స్వర్ణాంధ్ర .. స్వచ్ఛాంధ్ర .. కార్యక్రమంలో భాగంగా లక్షల నిధులు వెచ్చించి, మొక్కలు నాటుతూ .. పచ్చదనం, పరిశుభ్రత కోసం కృషి చేస్తుంటే కింది స్థాయి అధికారులు ఇలా నిర్లక్ష్యం వహించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో సుమారు 100కు పైగా ఎంతో విలువైన మొక్కలు ఎండిపోతున్నా, అధికారులు చూస్తూ ఉండటంపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఔరా .. అంటూ ముక్కున వేలు వేసుకుంటున్నారు. కార్యాలయంలో కళ్ల ముందు మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోని అధికారులు, మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనుల కింద నాటిన మొక్కల సంరక్షణ ఎలా చేపడతారంటూ ప్రశ్నిస్తున్నారు.

కలుగొట్లలో మెగా వైద్య శిబిరం

కోవెలకుంట్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుగొట్ల గ్రామంలోని శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమం పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీకళాశాల, స్వామి నేత్రాలయం ఆధ్వర్యంలో కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు, ఉప్పలపాడు, కలుగొట్ల గ్రామస్థులకు మెగా వైద్య వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీరామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉచిత వైద్యసేవలు నిర్వహించిన స్వామి నేత్రాలయం వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 160మందికి వైద్యసేవలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయకుమారి, హేమంత్‌రెడ్డి, ప్రగతిరెడ్డి, స్వామి నేత్రాలయం వైద్యులు ఎస్.లక్ష్మయ్య, కాశిరెడ్డినాయన ఆశ్రమ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, నాగార్జునరెడ్డి, అధ్యాపకులు ఎం.శ్రావణికుమారి, ఎం.ఇంతియాజ్ అహ్మద్, లక్ష్మిదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

డోన్ టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2016-17 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం విశ్రాంత ప్రధానోపాధ్యాయులు జె.రామచంద్రుడు అధ్యక్షత నిర్వహించారు. పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను శాలువ కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.అన్వర్‌బాషా, పి.ప్రసాద్, పి.అంజినప్ప, పి.నాగలక్ష్మి, సురేష్‌గౌడు, సుధాకర్, సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థులు పి.మౌలాలి, రఫీ, ఆలి, రాజు, శ్రీదేవి, ఇందు పాల్గొన్నారు.

హాస్టల్ భవనాన్ని ప్రారంభించాలి

డోన్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉన్న హాస్టల్ భవనాన్ని ప్రారంభించి ఐటీఐ విద్యార్థులకు ప్రయోజనం కల్పించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శివన్న డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఎంఈవో కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ భవనాన్ని ప్రారంభించకుంటే ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ నాయకులు వినోద్, రాజు, మనోజ్, మధు పాల్గొన్నారు.

బాలుడిపై పెంపుడు కుక్క దాడి

బేతంచెర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్‌నగర్ చెందిన ఏడేళ్ల బాలుడుపై పెంపుడు కుక్క దాడి చేసి గాయపరిచింది. విషయం తెలుసుకున్న బాలుడి తండ్రి కిరణ్‌ను సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్నా పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల దాడుల నుంచి పసిపిల్లల ప్రాణాలను కాపాడాలని కోరారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ప్యాపిలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అయిల్‌పామ్ సాగుపై ఉద్యానవనశాఖ అధికారులు, రైతులకు అవగాహన కల్పించారు. ఆదివారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను క్షేత్రస్థాయిలో రైతులకు చూపించారు. ఆయిల్ పామ్ సాగు ఎలా సాగుచేస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుడిపాడు తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతులు



నాడు ముళ్ల కంపలతో నిండిన కాలువ



నేడు మరమ్మతులు చేపట్టిన చెరువు కాలువ

చాగలమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట చెరువు నుంచి ఆయకట్టుకు నీరందించే పంట కాలువల మరమ్మతుల పనులు చేపట్టారు. చెరువుల మరమ్మతులకు మోక్షమెన్నడో అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురిత మైంది. స్పందించిన మైనర్ ఇరిగేషన్ అధికారులు చెరువు పంట కాలువలో పేరుకపోయిన పూడికతీత, ముళ్ల కంపలను తొలగింప చేసి కూలీలచే కాలువ పనులను చేయించారు. రూ.5 లక్షలు నిధులతో చెరువు కిందగల ఆయకట్టు కాలువ పనులు చేశారు. దీంతో కాలువలో సాగునీరు ప్రవహిస్తోంది. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో పంట కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేశారని టీడీపీ నాయకుడు గోపాల్ పేర్కొన్నారు. చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందించేందుకు కాలువల మరమ్మతులు చేశారని అన్నారు. నాడు వెలవెలబోతున్న కాలువలు ఈ ఏడాది మరమ్మతులకు నోచుకొని సాగునీటితో కళకళలాడుతున్నాయి.

హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు



సీపీఐ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

డోన్ రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ కార్యకార్యవర్గ సభ్యులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని తారక రామనగర్ శాఖ మహాసభ ఏఐవైఎఫ్ నాయకులు రణత్ యాదవ్ అధ్యక్షత నిర్వహించారు. సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతర సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో డోన్‌లో జరిగే సీపీఐ రెండో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, పట్టణ కార్యదర్శి మోటరాముడు, మండల కార్యదర్శినారాయణ, ప్రజానాట్య మండలి నాయకులు కోయలకొండ నాగరాజు, అనుబంధాల నాయకులు పుల్లయ్య, సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



వీఆర్ లక్ష్మిరెడ్డితో ముస్లిం మత పెద్దలు, నాయకులు

కొలిమిగుండ్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ వీఆర్ లక్ష్మిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం మతపెద్దలు, మైనార్టీ మండల కమిటీ నాయకులు వీఆర్ లక్ష్మిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో ముస్లింల సమస్యల పరిష్కారానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు వెంకటమల్లారెడ్డి, కనకాద్రిపల్లె గ్రామసర్పంచ్ శివశంకర్, పెద్దిరెడ్డి, ప్రభుత్వ ఖాజీ ఖాదర్‌వలి, ముస్లిం మతపెద్దలు, నాయకులు బాయ్‌కాటి హుస్సేన్, బొజ్జన్న, వలి, బాషా పాల్గొన్నారు.

దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

చాగలమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నూర్‌బాష దూదెకుల సంక్షేమం కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంపై ఆ సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రులు, నారా లోకేష్, బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దూదెకుల సంఘ నాయకులు పీరయ్య, మస్తాన్, లాల్‌బాషా, పెద్దదస్తగిరి, ఇమామ్‌బాషా, పెద్దబాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహబూబ్‌బాషా

వైభవంగా శ్రావణమాస పూజలు

చాగలమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గంగమ్మ, పెద్దమ్మ, చాగలమ్మ ఆలయాల్లో ఆదివారం శ్రావణమాస పూజలను వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గంగమ్మకు మహిళలు సామూహికంగా చీర, సారె సమర్పించి పండ్లు, పూలతో అలంకరించారు. వడిబియ్యం సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు..

రుద్రవరం: మండలంలోని రుద్రవరం, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి గ్రామదేవతలైన పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మలకు మహిళలు బోనాలు, చీరలు సమర్పించారు. గ్రామ దేవతలను పూజిస్తే పాడిపంటలు చల్లగా ఉంటాయని భక్తులు నమ్మకం వ్యక్తం చేశారు.

వక్కిలేరుకు జలకళ

చాగలమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మోస్తరు వర్షాలకు వక్కిలేరు జలకళ సంతరించుకుంది. ఎగువభాగం నుంచి వరద నీరు వక్కిలేరులో ప్రవహిస్తుండటంతో ఆదివారం వరద నీటి ఉధృతి పెరిగింది. పెద్దబోధనం, బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె గ్రామాల సమీపంలోని వక్కిలేరు వరద నీటితో ప్రవహించింది. వక్కిలేరులో నీరు ప్రవహించడంతో పరిసర గ్రామాల రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చాగలమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన నగల్లపాడు గ్రామ సమీపంలోని 40వ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకున్నది. వివరాలిలా.. నంద్యాలకు చెందిన యోగాంజల్‌రెడ్డి, భార్య మునెమ్మ(22) తమ చిన్నారితో ద్విచక్రవాహనంలో అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు వెళ్తున్నారు. చాగలమర్రి మండలంలోని నగల్లపాడు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి రహదారిలోని డివైడర్‌ను ఢీకొంది. దీంతో మునెమ్మ ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని టోల్‌ప్లాజా వాహనంలో ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి భర్త, కుమార్తె సురక్షితంగా బయట పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఉపాధ్యాయులకు గాయాలు

చాగలమర్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయలయ్యాయి. ఈ ఘటన ఇడమక మెట్ట సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. మండలంలోని తోడెండ్లపల్లె, చిన్నవంగలి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సుబ్బారావు, గురుచంద్రుడు ద్విచక్రవాహనంపై దువ్వూరుకు వెళ్తుండగా ఇడమక మెట్ట సమీపంలో మినీ లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. చెక్‌పోస్టు వద్ద ఉన్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

రుద్రవరం, జూలై 27 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కొండమాయపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి రంఖాసిం స్వామి జియారత్ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలు రుద్రవరం, చినకంబలూరు, తువ్వ పల్లె, వెలగలపల్లె, కొత్తూరు, కొత్తపల్లె, అప్పనపల్లె నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి రంఖాసింస్వామికి పూలచాదర్‌లు, వెండి గొడుగులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



కొండమాయపల్లెలో రంఖాసింస్వామికి ఫతెహాలు చేస్తున్న భక్తులు